# భీమారావు- బ్రతుకుతెరువు

- శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం

భీమారావు బి.కామ్. పాసయినాడు. డిగ్రీకి తోడుగా టైపు రైటింగ్, షార్ట్‌హ్యాండ్, సెక్రటేరియట్ ప్రాక్టీస్ వంటి ఒకేషనల్ సర్టిఫికెట్ కోర్సులు కూడా పాసయ్యాడు. 'ఆడ బిడ్డ లాంఛనాల లాగ' ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజిలో పేరు నమోదు చేయించుకున్నాడు. పత్రికలలో వచ్చే వాంటెడ్, కాలమ్స్ ఒక్కటీ బీరుపోకుండా చూసి అర్హత ఉన్న వాటన్నిటికీ అప్లెయి చేశాడు. అప్లై అప్లై నో రిప్లై అన్నట్లే అయింది.

పోనీ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీములో ఏమన్నా అవకాశం లభిస్తుందేమోనని అడ్డమైన వాళ్ళ కాళ్ళూ పట్టుకున్నాడు. అవసరమైన వాళ్ళందర్నీ కాకాపట్టాడు. పనికాకపోగా ఆ ఖర్చులకని ఈ ఖర్చులకని బాగా 'ఆముదం' అయింది.

ఇక నౌకరీపై ఆశ వదులుకొని ఏదన్నా వర్తకం చేద్దామనుకున్నాడు.

ఆప్తమిత్రులెవరో అప్పు ఇస్తే ఒక కిరాణా కొట్టు పెట్టాడు. 'కృష్ణవేణమ్మ గొనిపోయె నింత ఫలము; బిల బిలాక్షులు తినిపోయె తిలలు పెసలు' అన్నట్లు షాపులో ఎలుకలు బైఠాయించి మేజరు షేర్ హోల్డర్లు అయి అధికవాటా స్వాహా చేశాయి. గుడ్‌విల్ కోసం సరుకులు అరువు ఇస్తే తీసుకున్న వాళ్ళు తీసుకున్నట్లే ఉడాయించారు. ఆటోమేటిక్‌గా షాపు తన తలుపులు తానే మూసుకుంది.

ఇలా కాదని ఒక మంచి సెంటరు చూసి కిళ్ళీకొట్టు పెట్టాడు. కిళ్ళీ వేసుకుంటే నోరు పండినట్టు భీమారావు దురదృష్టం కూడా పండిపోయింది. ఆ సెంటర్లో వన్ వే ట్రాఫిక్ పెట్టారు. సగం జనం రద్దీ, రాకపోకలు తగ్గిపోయాయి. ఆ తర్వాత అక్కడ ఒక పెద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం ఒకటి బృహత్తరమైన దాన్ని చేపట్టి, కార్పొరేషన్ వాళ్ళు అక్కడ రస్తానే పూర్తిగా మూసేసి మరో వైపుగా ట్రాఫిక్ మళ్ళించారు. ఆ నిర్మాణం రెండు సంత్సరాల పనట. అందుకని భీమారావు తన కిళ్ళీకొట్టును కిళ్ళీ చుట్టేసినట్టు చుట్టి పారేయాల్సి వచ్చింది. మరోసెంటర్లో ఎక్కడా అవకాశం దొరకలేదు.

'జీవితంలో అలసట' కొద్దిగా ప్రారంభం అయింది. అయినా ధైర్యాన్ని కూడగట్టుకొని, ఒక సోడా బండి నెట్టుకుంటూ బ్రతుకు బండరాయిని ఎగువకు తోయటం మొదలెట్టాడు. వేసవిలో బాగానే సాగినా, వర్ష రుతువులోను, చలికాలంలోను ఆ సోడా బండి కూడా సజావుగా సాగనని మొండికేసింది.

అదీ లాభం లేదని స్కూలు పిల్లలకు ట్యూషన్లు చెప్పటం మొదలెట్టాడు. ట్యుటోరియల్ కాలేజీల




మర్రి చెట్లతో నిండిపోయిన ఈ విద్యా వ్యాపార జగత్తులో తన ట్యూషన్ వృత్తి అనే మొలక ప్రోత్సాహ సూర్యరశ్మి సోకక, తగినంత సంపోషక జలం లేక, మారాకు వేయక మొదట్లోనే ఎండిపోయింది.

అయినా విసుగు చెందని విక్రమార్కుడిలాగా బ్రతుకు శవాన్ని మోసుకొస్తూనే ఉన్నాడు!

ఒక దొంగ నోట్ల ముఠాతో పరిచయం, ఆ తర్వాత స్నేహం ఏర్పడ్డాయి. వాళ్ళతో చేయి కలిపాడు. కొన్నాళ్ళు ప్రతి నిముషం మూడు నాణెములు- ఆరు నోట్లు అన్నట్లుగానే గడిచిపోయింది. కాని తొందరలోనే ప్రభుత్వానికి ఆచూకీ అందే పరిస్థితి వచ్చింది. భీమారావు ముందుగానే ప్రమాదాన్ని పసిగట్టి, ఎలాగోలా చావు తప్పి, కన్నులొట్టబోయి, ఆ కూపంలోంచి బయట పడ్డాడు.

ఆ తర్వాత ఒక చిన్నసైజు స్మగ్లర్ అయ్యాడు. అందులోనూ పెద్దగా కలిసి రాలేదు. ఎదురుదెబ్బలే తగిలాయి. కారాగార పర్వం ప్రారంభం కాకముందే ఎలాగోలా ఆ స్మగ్లరాశ్రమ వృత్తికి కూడా గుడ్‌బై చెప్పాడు.

బ్రతుకు భారం అయిపోయింది. ఆ భారం మోయటానికి, కడుపు నింపుకోవటానికి ఏ వృత్తి అయినా ఫరవాలేదు అనే భావం, సిద్ధాంతం భీమారావులో చోటు చేసుకోసాగాయి.

రైళ్ళలోను, సినిమా హాళ్ళలోను చిన్న సైజు దొంగతనాలు చేస్తే బ్రతకగలమేమో అనుకున్నాడు. మొదటి ప్రయత్నంలోనే పట్టుబడి చావు దెబ్బలుతిని బయటపడ్డాడు.

ఇక ఆత్మహత్యే శరణ్యం అనుకున్నాడు. ఆ ప్రయత్నంలో ఎక్కడికో దూర తీరాలకు వెళ్ళిపోతుంటే తోవలో ఒక పాత స్నేహితుడు తారసిల్లాడు.

అతను భీమారావు గత చరిత్ర అంతా విని ''ఒక బ్రతుకు తెరువు చూపిస్తాను. నాతో వస్తావా?'' అన్నాడు.

ఏమిటో చెప్పమన్నాడు భీమారావు.

మిత్రుడు ఉద్యోగ వివరాలన్నీ చెప్పాడు. చేతినిండా పని. చేసుకుంటే చేసుకున్నంత. జీతం నెలవారీగా రాదుగాని, ప్రతిఫలం పేరుతో ఎప్పుడో ఒకప్పుడు వస్తూనే ఉంటుంది. అది నగదు రూపంలో కావచ్చు, లేదా వస్తు రూపంలో కావచ్చు. నెలలో ఎక్కువ రోజులు టూరింగే. పెద్దగా చదువు అక్కరలేదు. కాకపోతే ఎప్పుడూ మురుగు కంపుకొడుతూ ఉండే రొచ్చులోను, రొంపిలోను పని చేయాల్సి ఉంటుంది.

మిత్రుడు చెప్పిన ఆ జీవనోపాధిని చేపట్టాడు భీమారావు. ఇప్పుడు భీమారావుకు రోజులు నిరాఘాటంగా గడిచిపోతున్నాయి.

అర్థమయిందనుకుంటాను. భీమారావు రాజకీయాలలో దిగాడు.

★